**ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం**

**విశాఖపట్నం కేంద్రం**

**ప్రాంతీయ వార్తలు**

తేదీ:  29-07-2025            సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- విశాఖపట్నంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఆగస్ట్ 25 నుంచి స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ  చేయనున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- మహిళలకు ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.
- నూతన జాతీయ విద్యా విధానం 2020 నేటితో 5 సంవత్సరాలు పూర్తి చేసుకుంది.
- రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

==============================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటన మూడవ రోజు కొనసాగుతోంది. ఈరోజు సింగపూర్ అధ్యక్షులు షణ్ముగరత్నంతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్, సింగపూర్ ల మధ్య వివిధ రంగాల్లో సహకారం, భాగస్వామ్యంపై ఈ సందర్భంగా ఇరువురు చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, పి.నారాయణ, టీజీ భరత్ కూడా పాల్గొన్నారు. అనంతరం సింగపూర్ మాజీ ప్రధానమంత్రి లీ సైన్ లూంగ్‌తో కూడా ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.

==============================

విశాఖపట్నంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సింగపూర్ పర్యటనలో  భాగంగా ఈరోజు ఆ దేశ పారిశ్రామికవేత్తలు, వాణిజ్య సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ లో ఆయన పాల్గొన్నారు. మొత్తం 41 వాణిజ్య సంస్థలకు చెందిన ప్రతినిధులు ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు హాజరై తమ అభిప్రాయాలను తెలియచేశారు. డేటా సెంటర్లు, ఐటీ కంపెనీల

ఏర్పాటుకు విశాఖ అత్యుత్తమ ప్రదేశమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు తెలియజేశారు. త్వరలోనే గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుందని చెప్పారు. అలాగే దేశంలోనే తొలి క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు చేస్తున్నామని.. 2026 జనవరి నాటికి ప్రారంభమయ్యే ఈ క్వాంటం వ్యాలీ ఎకో సిస్టంలో పెట్టుబడులు పెట్టేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

==============================

రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఆగస్ట్ 25 నుంచి 31వ తేదీ వరకు స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ రోజు అమరావతి సచివాలయంలో ఆయన పాత్రికేయల సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రగతిలో అందర్నీ భాగస్వామ్యం చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు కోసం 16 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని, అందులో 9 లక్షల మందికి పైగా కొత్త కార్డులను మంజూరు చేశామని తెలిపారు. దీంతో రాష్ట్రంలో రేషన్ కార్డు లబ్ధిదారుల సంఖ్య కోటి 45 లక్షల 97 వేలకు చేరింది. డెబిట్ కార్డ్ పరిమాణం తరహాలో స్మార్ట్ రైస్ కార్డు ఉంటుందని, దీనిని క్యూ ఆర్ కోడ్ తో అనుసంధానం చేశామని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 32 సెకన్లు)

==============================

మహిళలకు ఆగష్టు 15వ తేదీ నుండి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఖచ్చితంగా అమలు చేస్తామని రాష్ట్ర రవాణా, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. తిరుపతిలో రాయలసీమ జిల్లాలకు చెందిన ఆర్టీసీ ఉన్నతాధికారులతో ఈ రోజు మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. 1400 కొత్త విద్యుత్ బస్సులను కొనుగోలు చేయనున్నామని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని అన్ని బస్టాండ్ లలో ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

==============================

నూతన జాతీయ విద్యా విధానం 2020 నేటితో 5 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. కేంద్ర మంత్రివర్గం 2020 జూలై 29న జాతీయ విద్యా విధానాన్ని ఆమోదించింది. 2030 నాటికి భారతదేశ విద్యా వ్యవస్థను సమూలంగా మార్చాలనే లక్ష్యంతో ఈ విధానానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. అభ్యాసన ప్రక్రియలో మార్పులు చేపట్టి 2047 వికసిత్ భారత్ దార్శనికతకు సాకారం చేసేందుకు బలమైన పునాది వేసేందుకు ఇది దోహదపడనుంది. అందులో భాగంగా చేపట్టిన సంస్కరణల్లో NIPUN భారత్, విద్యా ప్రవేశ్ వంటి కార్యక్రమాల ద్వారా ఇప్పటి వరకూ 4.2 కోట్లకు పైగా విద్యార్థులకు ప్రయోజనం చేకూరింది.

విరామం

==============================

విశాఖపట్నం వేదికగా వచ్చే నవంబర్ 14, 15 తేదీల్లో భాగస్వామ్య సదస్సు జరగనుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ఈ సదస్సు నిర్వహణకు పలు కమిటీలను ఏర్పాటు చేస్తూ.. ఈరోజు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆరుగురు మంత్రులతో కూడిన ఒక కమిటీ కూడా ఏర్పాటు కానుంది. ఈ మంత్రుల బృందానికి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మంత్రులు టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేశ్, పి. నారాయణ, కొండపల్లి శ్రీనివాస్ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. వసతుల కల్పన, ఏర్పాట్లకు సంబంధించి అధికారులతో మరో 9 వర్కింగ్ కమిటీలను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్రానికి పెట్టుబడులను సాధించాలనే లక్ష్యంతో ఈ సదస్సు జరగనుంది.

==============================

ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం సాంకేతికత, ఏఐ టూల్స్ అనుసంధానంతో ఈ ఏడాది దసరా ఉత్సవాలను నిర్వహించనున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు 11 రోజుల పాటు జరగనున్న దసరా ఉత్సవాలపై ఈ రోజు కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, ఏటా దసరా ఉత్సవాలకు విజయవాడ వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోందని.. ఈ ఏడాది రోజుకు దాదాపు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

“ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన” పథకం ద్వారా నంద్యాల జిల్లాను గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా పేర్కొన్నారు. ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై ఆమె సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో ప్రతి ఒక్కరూ పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా ఆదాయం పెరగడంతో పాటు కాలుష్యాన్ని నివారించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. ఒకసారి ఇంటిపై కప్పుపై సోలార్ ప్యానల్ పెట్టుకుంటే 25 సంవత్సరాల వరకు విద్యుత్ సమస్య ఉండదన్నారు. ఎలక్ట్రానిక్ వాహనాలకు కూడా ఛార్జింగ్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

==============================

హంద్రీనీవా ప్రాజెక్ట్ ఫేజ్-2 పూర్తి చేసి 3,850 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టుల పురోగతిపై ఈరోజు దృశ్య మాధ్యమం ద్వారా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఏర్పాటైన సంవత్సర కాలంలోనే ఫేజ్-2 లో భాగంగా హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు పూర్తిచేశామని చెప్పారు. అదేవిధంగా వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్స్ లో లైనింగ్, బెంచింగ్ పనులు ఆలస్యం కాకుండా 2026 జూన్ నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

==============================

దేశీయ మార్కెట్లు ఈరోజు లాభాలతో ముగించాయి. ఈ ఉదయం 80,891 పాయింట్ల వద్ద సెన్సెక్స్ ప్రారంభమై... చివరకు 446 పాయింట్లు లాభంతో 81,337 వద్ద ముగిసింది.

==============================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==============================
==============================